## ఎంపీ వర్సెస్ ఎమ్మెల్యే


ఉమ్మడి పాలమూరు జిల్లాలో కొంతమంది ఎమ్మెల్యేలు.. మంత్రుల తీరుపై తీవ్ర అసహనంతో ఉన్నారు. తాము చెప్పిన పనులు కావడం లేదని.. కాంట్రాక్టర్లకు బిల్లును చెల్లించాలన్నా కమీషన్లు ముట్టచెప్పాల్సి వస్తుందని వాపోతున్నారు. ప్రభుత్వం ఏర్పడి 13 నెలలు గడుస్తున్నా నియోజకవర్గాలకు నిధులు తేవడంలో విఫలమవుతున్నామని ఆవేదన చెందుతున్నారు. సమస్యలు ఎవరికి చెప్పుకోవాలో తెలియక లోలోపల బాధపడుతున్నారు. అయితే ఉమ్మడి జిల్లాలో ఎమ్మెల్యేలను కాదని డిప్యూటీ సీఎం భట్టి సోదరుడు నాగర్‌కర్నూల్ ఎంపీ జోక్యం ఎక్కువ కావడంతో ఎమ్మెల్యేలకు నచ్చడం లేదట. ఉమ్మడి జిల్లా అంతా అధికారులను.. లీడర్లను కమాండ్ చేస్తున్నారని బోగట. చాలామంది ఎమ్మెల్యేలు మొదటిసారి గెలవడంతో ఆ అనుభవం లేమీ వల్ల సీనియర్ల జోక్యం ఎక్కువైందని గుసగుసలు వినిపిస్తున్నాయి. దీంతో నల్లగొండ జిల్లాకు చెందిన కోమటిరెడ్డి ప్రధాన అనుచరుడైన జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి గెలిచిన మరుసటి రోజు నుంచి ప్రభుత్వానికి వ్యతిరేకంగా కామెంట్లు చేస్తూ వచ్చారు. అంతటితో ఆగకుండా ఏకంగా ఓ మంత్రి అండ చూసుకొని రాష్ట్రంలో నెంబర్ టు మంత్రిగా ఎదుగుతున్న మరో మంత్రిపై పరోక్షంగా విరుచుకుపడుతున్నారు. దీంతో సొంత పార్టీలోనే విపక్షంగా మారుతున్నారు.

- కాంగ్రెస్‌లో చిచ్చురేపుతున్న ఎమ్మెల్యేల రహస్య భేటీ
- నాగర్‌కర్నూల్ ఎంపీ కామెంట్లకు జడ్చర్ల ఎమ్మెల్యే కౌంటర్
- నేనేం బ్రోకర్ దందాల్లో లేను.. ఆ ఫైల్ ఏమిటో బయటపెట్టాలని డిమాండ్

## 'మేము బ్రోకర్ దందాలు చేసేటోళ్లం కాదు'..

'మా ఫ్యామిలీకి ఓ చరిత్ర ఉంది.. మేము బ్రోకర్ దందాలు చేసేటోళ్లం కాదు.. ఒకవేళ నిజంగా నేను ఆ ఫైల్ గురించి అడిగి ఉంటే రెవెన్యూ మినిస్టర్‌ను బయట పెట్టమనండి'.. అంటూ జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి సవాల్ విసిరారు. 'ఏ ఫైల్ అడిగాను.. ఏముందో చెప్పమనండి.. నేను కూడా ఆధారాలతో సహా చెప్తా.. రెవెన్యూ మినిస్టర్ బయటికి వచ్చి నేను ఏ ఫైల్ గురించి అడిగినో చెప్పాలి.. అప్పుడు నేనూ చెబుతా.. ఉట్టిగానే నా క్యారెక్టర్ అసాశినేషన్ చేస్తే ఊరుకోను'.. అంటూ నాగర్‌కర్నూల్ ఎంపీపై విరుచుకుపడ్డారు. రాష్ట్ర ఇన్‌చార్జి దీపాదాస్ మున్షి వస్తున్నారు.. మొత్తం మాట్లాడి వివరాలు చెప్తా' అన్నారు. 'నేను డైరెక్ట్‌గా ఎంపీకి సవాల్ విసురుతున్న.. ఆ ఫైల్ గురించి ఎవరు ఫీడ్ చేశారో చెప్పమనండి.. నాకు ఆయనతో మంచి సంబంధాలు ఉన్నాయి.. ఆయన చేత ఎవరు చెప్పించారో చెప్పాలి.. నేనడిగిన ఫైల్ ఏమిటో బయట పెట్టాలి' అంటూ డిమాండ్ చేశారు. 'దీనిపై నేను ఎలాంటి సవాల్‌కైనా సిద్ధంగా ఉన్నాను.. ఏ గుడికి రమ్మన్నా వస్తాను.. ఆ ఫైల్ వివరాలు ఏమిటో బయటపెట్టాలి' అన్నట్లు తెలిసింది. 'ఈ ఫైల్‌పై మంత్రి, ఎంపీ కచ్చితంగా మాట్లాడాలి' అంటూ సవాల్ చేశారు. ఎన్నికల్లో మేము ఎన్నో హామీలు ఇచ్చినాం.. ఆ హామీలు నెరవేర్చాలంటే ఫండ్స్ కావాలి.. వీటి కోసం రిక్వెస్ట్ చేసుకోవాలి కదా.. అంటూ చెప్పుకొచ్చారు. మా బాధ ను వెల్లడించాలని అందరం కలిసి నిర్ణయం తీసుకున్నాం.. అంటూనే త్వరలో వివరాలన్నీ బయటపెడతా.. అంటూ సదరు ఎమ్మెల్యే చెప్పడం సర్వత్రా ఆసక్తి నెలకొన్నది.

- అనిరుధ్‌రెడ్డికి టచ్‌లో మరికొంత మంది ఎమ్మెల్యేలు ?
- పెండింగ్ ఫైల్ కోసమే అంటూ..
- పాలమూరు జిల్లా చుట్టూ తిరుగుతున్న రాష్ట్ర రాజకీయాలు
- ఆ ఎమ్మెల్యేలపై రహస్య నిఘా..!



# ఎంపీ X ఎమ్మెల్యే

### మధ్యలో మంత్రి

మహబూబ్‌నగర్, ఫిబ్రవరి 3 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : కాంగ్రెస్ పార్టీలో కుంపటి రగులుతోంది. సీఎం సొంత జిల్లా పాలమూరు జిల్లా చుట్టూ రాష్ట్ర రాజకీయాలు తిరుగుతున్నాయి. తాజాగా ఎమ్మెల్యేల రహస్య మీటింగ్‌పై నాగర్‌కర్నూల్ ఎంపీ చేసిన వ్యాఖ్యలు పెద్ద దుమారాన్ని సృష్టిస్తున్నాయి. మంత్రి పొంగులేటి శ్రీనివాస్ వద్ద జడ్చర్ల ఎమ్మెల్యేకు సంబంధించిన ఒక ఫైలు పెండింగ్‌లో ఉన్నదని, దాని కోసమే ఇదంతా అంటూ ఎంపీ చేసిన వ్యాఖ్యలపై సదరు ఎమ్మెల్యే ఘాటైన కౌంటర్ ఇచ్చారు. ఆ ఫైల్ ఏమిటో మంత్రి బయటపెట్టాలని.. ఎంపీ చెప్పాలని డిమాండ్ చేశారు. 'నేనేం బ్రోకర్ దందాలు చేయడం లేదు'.. అంటూ ఎంపీపై పరోక్షంగా విమర్శలు సంధించారు. ఎమ్మెల్యేల రహస్య భేటీ.. ఎంపీ, ఎమ్మెల్యేలు వర్సెస్ మంత్రిగా మారిపోయింది. హైదరాబాద్‌లోని ఐటీసీ కోహినూర్ హోటల్లో జరిగిన సమావేశం తర్వాత రాష్ట్ర రాజకీయాలు ఒక్కసారిగా వేడెక్కాయి. మంత్రుల నియోజకవర్గం నిధులు వస్తున్నాయి.. అంటూ సొంత పార్టీ ఎమ్మెల్యేలే కామెంట్లు చేశారు. ఈ రహస్య భేటీ జరుగుతున్న విషయాన్ని తెలుసుకొని ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల అక్కడికి వెళ్లినట్లు సమాచారం. హోటల్లో సమావేశమైన ఎమ్మెల్యేలంతా సీఎం వద్ద తేల్చుకుంటామని.. మాతో మాట్లాడడానికి సీఎం ఒప్పుకున్నారంటూ చెబుతున్నారు. మరోవైపు ఎంత జిల్లాలో ఎమ్మెల్యేలను ఉసి గొల్పడం వెనుక నల్లగొండ జిల్లాకు చెందిన మరో మంత్రి హస్తం ఉన్నట్లు ప్రచారం జోరందుకున్నది. మొత్తంపైన ఎమ్మెల్యేల రహస్య భేటీ వ్యవహారం 'చిలికి చిలికి గాలివాన'గా మారింది. ఈ సమావేశానికి నాయకత్వం వహించిన జడ్చర్ల ఎమ్మెల్యేకి.. మరి కొంతమంది ఎమ్మెల్యేలు టచ్‌లోకి వస్తున్నట్లు తెలుస్తోంది.

**ఏపీ సీఎం చంద్రబాబుతో ఫైట్**

మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అండతో టికెట్ తెచ్చుకొని ఎన్నికైన జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి సీఎం చంద్రబాబును టార్గెట్ చేశారు. తిరుమల సిఫార్సు లేఖల విషయంలో అవసరమైతే చంద్రబాబును తెలంగాణలో రానివ్వమంటూ కామెంట్లు చేసి సీఎం రేవంత్‌రెడ్డికి కొరకరాని కొయ్యగా తయారయ్యారు. దీంతో దిగివచ్చిన ఏపీ ప్రభుత్వం తిరుమలలో ఎమ్మెల్యేల సిఫార్సు లేఖలను అంగీకరించింది. ఆ తర్వాత సొంత ప్రభుత్వంపైనే విమర్శలు ఎక్కుపెట్టారు. బీఆర్‌ఎస్ హయాంలో మత్స్య శాఖకు అత్యధిక ప్రాధాన్యతనిస్తే మన ప్రభుత్వంలో ఇవ్వడం లేదంటూ ఆరోపణలు చేశారు. మత్స్యకారులకు అండగా ఉండకపోతే ఎలా అంటూ ప్రశ్నించారు. దీంతో ప్రభుత్వం దిగివచ్చి 50 శాతం చేప పిల్లలను వదిలేందుకు నిర్ణయం తీసుకున్నది. అంతటితో ఆగకుండా పోలేపల్లి సెజ్‌లో అరబిందో ఫార్మా కంపెనీకి వ్యతిరేకంగా ఏకంగా శాసనసభలో ప్రస్తావించారు. కాలుష్యం కారకాలు వెదజల్లుతున్న ఆ కంపెనీని మూసివేయాలని డిమాండ్ చేశారు. ఆ తర్వాత నియోజకవర్గంలో తన మాట వినడం లేదంటూ ఏకంగా బాలానగర్ తాసీల్దార్ ఆఫీస్‌కు వెళ్లి హంగామా సృష్టించారు. ప్రభుత్వ అధికారులపై ఆరోపణలు గుర్తించి తనకు అనుకూలంగా లేని వారిపై సస్పెన్షన్ వేటు వేయించారు. కాగా రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ తన మాట వినడం లేదంటూ చాలామంది లీడర్ల వద్ద వాపోయారు. ఆయన్ను టార్గెట్ చేస్తూ అనిరుధ్‌రెడ్డి చేస్తున్న వ్యాఖ్యలు సీఎంను ఇరుకున పెడుతున్నారు.

**ఎప్పుడు వెళ్లినా సర్వేను అడ్డంపెట్టి..**

ఉమ్మడి పాలమూరు జిల్లాకు చెందిన రేవంత్‌రెడ్డి సీఎం కావడంతో ఇక జిల్లాకు నిధుల ఇబ్బంది ఉండదని అంతా భావించారు. ఏడాది కాగానే అంతా రివర్స్ అయింది. ఉమ్మడి జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు ఎప్పుడు వెళ్లి సీఎంను కలిస్తే ఇచ్చిన విజ్ఞాపనలు అన్ని బుట్టదాఖలు అవుతున్నాయి. తాజాగా సీఎం సొంతంగా చేపట్టిన సర్వేలో ఉమ్మడి జిల్లాకు చెందిన చాలామంది ఎమ్మెల్యేల పని తీరు బాగాలేదని తేలింది. ఇక ఎప్పుడు వెళ్లి సీఎంను కలిసినా మీ పని తీరు బాలేదు అంటూ సర్వేలో తేలింది.. జాగ్రత్త అంటూ బయటకు పంపించి వేస్తున్నారు. దీంతో అసహనం పెరిగిన ఎమ్మెల్యేలంతా జట్టుగా తయారయ్యారు. నియోజకవర్గాలకు నిధులు రాకపోవడం.. సీఎంకు మంత్రులకు విజ్ఞాపనలు ఇచ్చినా అవన్నీ నెరవేరకపోవడంతో తిరుగుబావుట ఎగురవేస్తున్నారు. ఈ ఎమ్మెల్యేల వెంబడి ఒకరిద్దరూ మంత్రుల అండదండలు ఉన్నాయని ప్రచారం జరుగుతోంది.

**ముదిరాజ్ వర్గానికి మంత్రి పదవి ఇస్తానని..**

ఎంపీ ఎన్నికల్లో గెలిపించండి.. ఆగస్టు 15లోపు ముదిరాజ్ బిడ్డ అయిన మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరికి మంత్రి పదవి ఇస్తానని సాక్షాత్తు సీఎం రేవంత్‌రెడ్డి పాలమూరు సాక్షిగా హామీ ఇచ్చారు. మాట ఇచ్చి ఆరు నెలలు దాటినా ఇప్పటి వరకు మంత్రి పదవి ఇవ్వలేదు. ఢిల్లీకి పంపిస్తున్న లిస్టులో వాకిటి శ్రీహరి పేరే గల్లంతవుతోంది. దీంతో బీసీ సామాజిక వర్గానికి చెందిన శ్రీహరి కూడా అసంతృప్తితో ఉన్నారు. అయితే ఈ భేటీకి ఆయన దూరమైనట్లు తెలిసింది. నారాయణపేట జిల్లాలో కూడా అసహనం రగులుతోంది. ఇక మిగతా ఎమ్మెల్యేలు నిధులు తీసుకురాలేక... బీఆర్‌ఎస్ హయాంలో మంజూరైన వాటికి బిల్లులు కాంట్రాక్టర్లకు ఇప్పించుకోలేక మదన పడి పోతున్నారు. దీంతో సీఎం సొంత జిల్లాలోనే ఎమ్మెల్యేలు కుంపటి పెట్టారు.



త్రీ ఇన్‌వన్ సైకిల్‌ను తయారు చేసిన గగన్‌చంద్రతో తల్లిదండ్రులు నాగమణి, భాస్కర్

## త్రీ ఇన్‌వన్ సైకిల్

- సోలార్, పెట్రోల్, బ్యాటరీతో నడిచే సైకిల్ తయారీ
- సైకిల్‌లా తొక్కొచ్చు.. బైక్‌లా నడపొచ్చు
- నల్లమలలోని బల్మూర్‌కు చెందిన విద్యార్థి గగన్‌చంద్ర ప్రతిభ
- జాతీయ సైన్స్‌ఫెయిర్‌కు ఎంపిక

బల్మూరు, ఫిబ్రవరి 3 : సోలార్ విద్యుత్, బ్యాటరీ, అవసరమైనప్పుడు పెట్రోల్‌తో నడిచే హైబ్రిడ్ త్రీ ఇన్ వన్ సైకిల్‌ను రూపకల్పన చేశాడు నల్లమలకు చెందిన నిరుపేద హైటెక్ విద్యార్థి మాంచి నేని గగన్‌చంద్ర. హైబ్రీడ్ సైకిల్‌ను బైక్‌లా నడుపావచ్చు.. సైకిల్‌లా తొక్కవచ్చు అంటున్నాడు 14ఏండ్ల కుర్రాడు. గగన్‌చంద్రది అచ్చంపేట నియోజకవర్గంలోని ఏజెన్సీ గ్రామమైన బల్మూరు మండల కేంద్రం. బల్మూరుకు చెదిన నాగరాణి, భాస్కర్‌ల ఏకైక కుమారుడు. ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతూ ఇటీవల పాండిచ్చేరిలో నిర్వహించిన సైన్స్‌ఫెయిర్‌లో తృతీయ బహుమతి సాధించి జాతీయస్థాయికి ఎంపికయ్యాడు. సైకిల్‌ను ఎలాంటి ఖర్చు లేకుండా బ్యాటరీతో 35 కిలోమీటర్ల దూరం ప్రయాణించేలా.. సోలార్ విద్యుత్‌తో రోజంతా ప్రయాణించేలా సైకిల్‌ను రూపొందించాడు. సాధారణ సైకిల్‌కు ఎలక్ట్రికల్ బ్యాటరీ, సోలార్ ప్యానల్, హబ్ మోటరు అమర్చాడు. డిజిటల్ స్పీడో మీటర్, సెంట్రల్ బాక్ సిస్టిమ్‌తో పాటు నావిగేషన్, జీపీఎస్, ట్రాకింక్ సిస్టమ్‌ను ఏర్పాటు చేశాడు. అధునాత వాహనాల మాదిరిగా ఈ సైకిల్‌కు ఉన్న జీపీఎస్‌తో ఎక్కడి నుంచైనా ట్రాకింగ్ చేయవచ్చు. మొబైల్ వాయిస్స కమాండ్, అలెక్సాతో మ్యూజిక్, కాల్స్ ఆపరేటర్ చేసేలా సైకిల్‌ను రూపకల్పన చేశాడు. సైకిల్‌తో కంట్రోల్ బాక్స్‌ను గగన్ సొంతంగా తయారు చేశాడు. అవసరమైన సామగ్రిని ఆన్‌లైన్‌లో కొనుగోలు చేశాడు. ఇప్పటి వరకు మొత్తం రూ.30వేల వరకు ఖర్చు చేశాడు. భవిష్యత్‌లో ఈ ఖర్చును మరింత తగ్గిస్తానంటున్నాడు. ఇటీవల నిర్వహించిన జాతీయస్థాయి సైన్స్‌ప్రదర్శనలో దాదాపు 250 మంది పాల్గొనగా.. ఫిబ్రవరిలో నిర్వహించనున్న జాతీయ స్థాయి సైన్స్‌ఫెయిర్‌కు గగన్‌చంద్ర ఎంపికకాగా.. సైకిల్ తయారీకి కావాల్సిన పరికరాలు, వస్తువులు ఇప్పించే విధంగా ఎమ్మెల్యే కృషి చేయాలని గ్రామస్తులు కోరారు.

**ఎలక్ట్రిక్ కారు చేయడమే లక్ష్యం**



భవిష్యత్‌లో పేద, సామన్యులు, దివ్యాంగులకు ఎలక్ట్రిక్ కారు తయారు చేయడమే లక్ష్యంగా పెట్టుకున్నా. ఎవరికైనా ఒక వెహికిల్ ఉండాలనే విధంగా తయారు చేయాలన్నదే ముఖ్యంగా పెట్టుకున్నా. మొబైల్‌తో లాక్ సిస్టమ్ ఏర్పాటు చేయడంతో దొంగలు ఎవరూ ప్రయత్నించినా.. సెల్‌ఫోన్‌లో కనిపిస్తుంది. తల్లిదండ్రుల సహకారం ఎంతో ఉంది. సోలార్‌తో పగలు, రాత్రి బ్యాటరీతో నడుపవచ్చు. దివ్యాంగుల కోసం సోలార్‌తో తయారు చేయడం ముందున్న లక్ష్యం. తక్కువ ఖర్చుతో ఎక్కువమందికి ఉపయోగపడే విధంగా ఎలక్ట్రిక్ కారును తయారు చేయాలన్నదే లక్ష్యం.

**– గగన్ చంద్ర, విద్యార్థి, బల్మూరు**

## వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు మృతి

జడ్చర్ల, ఫిబ్రవరి 3: జడ్చర్లలో ఆదివారం రాత్రి జరిగిన వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు మృతిచెందినట్లు సీఐ ఆదిరెడ్డి తెలిపారు. సీఐ కథనం ప్రకారం.. జడ్చర్లలోని జాతీయ రహదారి చివరలో ఆదివారం అర్ధరాత్రి బైక్‌ను డీసీఎం ఢీకొన్న ఘటనలో రాములు(45)అనే వ్యక్తి మృతిచెందినట్లు తెలిపారు. నాగర్‌కర్నూల్ జిల్లా తిమ్మాజిపేట మండలం ఆవంచకు చెందిన రాములు జడ్చర్ల ఫ్లైఓవర్ చివరలో కావేరమ్మపేట దగ్గర రాంగ్‌రూట్‌లో బైక్‌పై వెళ్తుండగా.. ఎదురుగా వచ్చిన డీసీఎం ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడ్డాడు. క్షతగాత్రుడిని హైదరాబాద్‌లోని ఉస్మానియా దవాఖానకు తరలించగా చికిత్సపొందుతూ మృతిచెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. అలాగే జడ్చర్ల ఫ్లైఓవర్ కింద నడుచుకుంటూ వెళ్తున్న వ్యక్తిని వెనుక నుంచి లారీ ఢీకొన్న ఘటనలో శ్రీనివాస్(28) అనే వ్యక్తి మృతిచెందినట్లు సీఐ ఆది రెడ్డి తెలిపారు. రంగా రెడ్డిజిల్లా షాబాద్‌కు చెందిన శ్రీనివాస్ ఆదివారం రాత్రి జడ్చర్ల ఫ్లైఓవర్ కింద నడుచుకుంటూ వెళ్తుండగా.. వెనుకనుంచి వచ్చిన లారీ ఢీకొట్టింది. తీవ్ర గాయాలు కాగా మహబూబ్‌నగర్ జిల్లా దవాఖానకు తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో హైదరాబాద్ తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతిచెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

## నిధులు సాధించడంలో ఎంపీలు విఫలం

- బీఆర్‌ఎస్ నారాయణపేట జిల్లా అధ్యక్షుడు రాజేందర్‌రెడ్డి

ధన్వాడ, ఫిబ్రవరి 3 : రాష్ట్రానికి కేంద్రం నిధులు సాధించడంలో ఎంపీలు పూర్తిగా విఫలమయ్యారని బీఆర్‌ఎస్ నారాయణపేట జిల్లా అధ్యక్షుడు ఎస్.రాజేందర్‌రెడ్డి విమర్శించారు. సోమవారం మండల కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. నారాయణ పేట జిల్లాకు సైనిక్ స్కూల్ సాధించడంలో బీజేపీ ఎంపీ ఉన్నా ఫలితం లేకుండా పోయిందన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్, బీజేపీకి చెరో 8మంది ఎంపీలు ఉన్నా నిధులు ఎందుకు తేలేదని ప్రశ్నించారు. అలాగే రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ 14 నెలలుగా ఒక్క గ్యారెంటీ కూడా పూర్తిస్థాయిలో అమలు చేయలేదన్నారు. ప్రజలను మభ్యపెట్టి అధికారంలోకి వచ్చిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేసి తమ చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని డిమాండ్ చేశారు. తన సొంత గ్రామం శేరి వెంకటాపూర్‌లో రూ.2లక్షల్లోపు 175మంది రైతులకు రుణం ఉన్నా.. ఇంకా మాఫీ కాలేదన్నారు. వరికి బోనస్ ఇస్తామని చెప్పిన ప్రభుత్వం రైతులకు ఎందుకు బోనస్ ఇవ్వడంలేదని దుయ్యబట్టారు. రాష్ట్రంలో ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఏర్పడిందన్నారు. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు కుంటుపడిందని విమర్శించారు. బీఆర్‌ఎస్ కార్యకర్త ఇర్ఫాన్‌పై పెట్టిన తప్పుడు కేసు వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేవారు. సమావేశంలో బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, నాయకులు సుధీర్‌కుమార్‌రావు, చంద్రశేఖర్, మాధవరెడ్డి, సురేందర్‌రెడ్డి, మల్లేశ్‌గౌడ్, శాంతకుమార్, శివా రెడ్డి నాజర్, ఇర్ఫాన్, వెంకట్రాములు, రామకృష్ణారెడ్డి, వీరేశ్ కుమార్‌గౌడ్, బాలరాజు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ పేట జిల్లా అధ్యక్షుడు ఎస్‌ఆర్‌రెడ్డి

## అనుమానాస్పదంగా మహిళ మృతి

బిజినేపల్లి, ఫిబ్రవరి 3 : అనుమానాస్పదంగా మహిళ మృతిచెందిన ఘటన మండలంలోని మహాదేవునిపేటలో సోమవారం వెలుగులోకి వచ్చింది. పోలీసుల కథనం ప్రకారం.. మహదేవునిపేటకు చెందిన యాదమ్మ(55)కు కరుణాకర్, పరమేశ్ ఇద్దరు సంతానం. చిన్న కుమారుడు హైదరాబాద్‌కు వెళ్లడంతో పెద్ద కుమారుడు కరుణాకర్ కూలీ పనులు చేసూకుంటూ ఇంటి వద్ద ఉంటున్నాడు. దీంతో నిత్యం తాగుతూ తిరుగుతుండేవాడు. తల్లి మందలించేది. ఈ క్రమంలో ఈనెల 2వ తేదీన గ్రామంలోని కృష్ణయ్య ఇంటి వెనకాల దుర్వాసన రావడంతో గమనించిన స్థానికులు శివ, రాములు వెళ్లి చూడగా.. యాదమ్మ చనిపోయినట్లు గుర్తించారు. పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఘటనా స్థలానికి సీఐ కనకయ్య, ఎస్సై శ్రీనివాసులు చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. ఘటనపై మృతురాలి భర్త ముత్తయ్య తన పెద్ద కుమారుడే కొట్టి చంపి ఉంటాడని అనుమానంతో ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపడుతున్నట్లు తెలిపారు.



ధాన్యం తూకం వేస్తున్న సిబ్బంది (ఫైల్)

# బోనస్ గోస

- వనపర్తి జిల్లాలో రూ.32కోట్లు పెండింగ్
- నార్మల్‌గా ఇచ్చే డబ్బులు అందని వైనం
- రెండు నెలలుగా తప్పని పడిగాపులు
- పట్టించుకోని అధికారులు
- అష్టకష్టాలు పడుతున్న 14వేల మంది అన్నదాతలు

వనపర్తి, ఫిబ్రవరి 3 (నమస్తే తెలంగాణ) : జిల్లాలో వరి ధాన్యం కొనుగోళ్లుముగిసి నా.. డబ్బులు రాకా అన్నదాతలు నానా అవస్థలు పడుతున్నారు. ధాన్యం విక్రయాల తర్వాత వెంటనే డబ్బులు జమ అవుతాయని చెప్పడమేకానీ, అమలు కావడం లేదు. దీంతో రోజుల తరబడి రైతులు కంట్లో ఒత్తులు వేసుకుని డబ్బుల కోసం ఎదురు చూస్తున్నారు. జిల్లాలో రూ.2,24,093 టన్నుల ధాన్యాన్ని ఐకేపీ, పీఏసీసీఎస్, మెప్మా ద్వారా కొనుగోలు చేశారు. రైతుల ఖాతాల్లో వేగంగా డబ్బులు జమ చేస్తామన్న ప్రభుత్వం అందుకు తగ్గ చర్యలు తీసుకోవడం లేదు.

**రూ.32కోట్ల బోనస్ పెండింగ్**

సన్న వడ్లకు క్వింటాకు రూ.500 బోనస్ ప్రకటించిన ప్రభుత్వం వాటిని పంపిణీ చేయడంలో మీనమేషాలు లెక్కిస్తుంది. ఇప్పటి వరకు జిల్లాలో సుమారు 25వేల మంది రైతులు సన్న రకం వడ్లను ప్రభుత్వానికి విక్రయించారు. ఈ రైతుల నుంచి దాదాపు లక్షా 36,203 మెట్రిక్ టన్నుల సన్న వడ్లను కొనుగోలు చేశారు. అయితే, వీరిలో ఇంకా చాలా మంది రైతులకు బోనస్ డబ్బులు రాలే దు. దాదాపు రూ.32కోట్లు బోనస్ అందుకోవాల్సిన రైతులున్నారు. ప్రారంభంలో కొంత బోనస్ డబ్బులు ఇచ్చినట్లు చేసినా.. క్రమంగా ఆలస్యం చేస్తూ పెండింగ్ పెడుతూ వస్తున్నారు. 40రోజులకు పైబడి వరి ధాన్యం అమ్ముకున్న రైతులు ఎప్పుడు బోనస్ పడుతుందంటూ అధికారుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. జిల్లాలో 14వేల మంది రైతులు బోనస్ డబ్బుల కోసం ఎదురు చూస్తున్నట్లు లెక్కలు చెబుతున్నాయి. ప్రభుత్వం నుంచి ఉలుకు..పలుకు లేక పోవడంతో రైతులు నిరాశలోనవుతున్నారు. అధికారులను వాకబు చేసినా సరైన సమాధానాలు రావడం లేదని రైతులు బావురుమంటున్నారు.

**రెగ్యులర్‌గా ఇచ్చే డబ్బులకు అవస్థలే..**

వానకాలంలో వరి ధాన్యం అమ్ముకున్న రైతులు ఒక్కొక్కరు ఒక్కో కష్టాన్ని.. నష్టాన్ని ఎదుర్కొన్నారు. పదేండ్ల నుంచి వరిధాన్యం బీఆర్‌ఎస్ ప్రభుత్వమే కొనుగోలు చేసి సాఫీగా నడిపించింది. అయితే, ఈ ఏడాది పడినంత ఇబ్బంది ఎప్పుడు చూడలేదని రైతులు చెబుతున్నారు. ఆఖరికి కరోనా సమయంలో కూడా ఇలాంటి పరిస్థితిని చూడలేదన్న అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. విక్రయాలు చేయడం ఆలస్యం చేశారు. తూకం వేసిన అనంతరం లారీలు లేవని వారం రోజులు బ్రేక్, మిల్లులకు తరలించిన తర్వాత ధాన్యం సరిగా లేదని మరో 10 రోజులు నిలిపివేశారు. చివరకు అన్ని అయినా డబ్బులు ఇవ్వడంలో నరకం చూశామని రైతులు లబోదిబోమంటున్నారు. బోనస్‌తోపాటు అసలు డబ్బులను కూడా చివరి దశలో పెండింగ్ పెట్టి రైతులను ఇబ్బందులకు గురి చేశారు. దీనికి సంబంధించి తక్‌పట్టీలు రాక పోవడం.. మిల్లర్లు సహకరించక పోవడంతో రైతులకు వెంటనే అందాల్సిన డబ్బులు కూడా చేరలేదు. 20రోజుల కిందట ధాన్యం అమ్ముకున్న రైతులకు ఇప్పటి వరకు అసలు డబ్బులు పడలేదంటే అర్థమవుతుంది. ట్రక్ సీట్స్ త్వరగా ఇవ్వక పోవడం.. మిల్లర్స్ అకనాలెడ్జ్‌మెంట్ అందక పోవడం, ట్యాబ్ ఎంట్రీలు ఆలస్యం చేయడంలాంటి సమస్యలతో రైతులు ఇబ్బందులు పడ్డారు. బోనస్ డబ్బుల ఇబ్బందులతోపాటు నార్మల్‌గా ఇచ్చే డబ్బులు సైతం ఆలస్యంగా రైతుల ఖాతాల్లో వేయడంతో అనేక అవస్థలను ఎదుర్కొన్నారు.

**సర్కారు కొన్నది సగం ధాన్యమే..**

జిల్లాలో 4లక్షల మెట్రిక్ టన్నుల వరి ధాన్యం లక్ష్యం పెట్టుకున్న జిల్లా పౌరసరఫరాల శాఖ అనుకున్న మేర లక్ష్యాన్ని అందుకోలేక పోయింది. ఇందుకోసం ప్రభుత్వం 263 కొనుగోలు సెంటర్లను ఏర్పాటు చేసింది. సెంటర్ల ద్వారా సగం ధాన్యం కూడా కొనుగోళ్లుచేయలేక పోయారన్న విమర్శలు వెలువడుతున్నాయి. ప్రభుత్వ సెంటర్ల ద్వారా మొత్తం 2లక్షల 24వేల మెట్రిక్ టన్నుల ధాన్యం మాత్రమే కొనుగోలు చేశారు. ప్రారంభంలో సెంటర్లు మొదలు కాక రైతులు తీవ్రంగా ఇబ్బందిపడ్డారు. మద్దతు ధరకు సమానంగా ప్రైవేట్‌లో కూడా వానకాలం సీజన్‌లో వ్యాపారులు కొన్నారు. జిల్లాలోని రైస్ మిల్లులన్నీ డిఫాల్టర్‌గా ఉండడంతో ప్రారంభంలో ఒకరిద్దరికి మినహా అర్హత రాలేదు. దీంతో ప్రభుత్వానికి.. మిల్లర్లకు మధ్య పొసగక సెంటర్ల ప్రారంభం ఆలస్యమైంది. ఇలా ఇదే అదనులో ప్రైవేట్ వ్యాపారులు రంగంలోకి దిగి భారీగానే కొనుగోలు చేయడంతో ప్రభుత్వ కొనుగోళ్లు లక్ష్యంలో సగానికి పడి పోయాయి. ఇలా సగం ధాన్యం కొంటేనే సర్కారు డబ్బుల వ్యవహారం ఇలా ఉంది. మొత్తం కొనుగోళ్లు చేస్తే ఇంకెలా ఉంటుందోనన్న సందేహాలు వ్యక్తమయ్యాయి.

### నెలరోజులైనా బోనస్ పడలే..



నేను సన్న వడ్లు అమ్ముకుని నెల రోజులైంది. ఇంతవరకు బోనస్ రాలేదు. వడ్లు కొన్న కేంద్రం వాళ్లను అడిగితే వస్తాయి.. మా చేతుల్లో ఏమీ లేదంటున్నరు. సర్కార్ వేసినప్పుడే డబ్బులు వస్తాయని చెబుతున్నారు. ఒక్క ఊళ్లోనే కొందరికి డబ్బులు రావడం.. మాలాంటి వాళ్లకు ఇంకా రాకపోవడానికి కారణం కూడా చెప్పడం లేదు. 65 క్వింటాళ్లు అమ్ముకున్న. బోనస్ వస్తే అప్పులైనా కట్టుకుందామనుంటే ఆలస్యమవుతూనే ఉంది. ఇంకా ఎన్ని రోజులు ఎదురుచూడాలో తెలియడం లేదు. రైతులకు ఈ పరీక్షలు ఎందుకు పెడుతున్నట్లు తెలుస్తలేదు. ఏ పని చూసినా సగం..సగం. చెప్పేదెందుకు చేయకుండా ఉండేదెందుకు. ఇలా అవస్థలు పెట్టడం సరికాదు. రైతులను మోసం చేసినట్లే. ప్రభుత్వం చేస్తున్న పనికి అప్పుల వాళ్లకు చెప్పలేక మొఖం చాటేస్తున్నం. ఏదో ఒకటి చెప్పండి. మా గోస మేం పడతాం. **– రాములు, రైతు, కేతేపల్లి, పాన్‌గల్ మండలం**

## గద్వాల జిల్లాలో రూ.20కోట్లు..

గద్వాల అర్బన్, ఫిబ్రవరి 3 : రాష్ట్ర ప్రభుత్వం సన్నరకం ధాన్యానికి బోనస్ చెల్లిస్తామని చెప్పడంతో జిల్లాలో పెద్ద మొత్తంలో రైతులు తమ ధన్యాన్ని కొనుగోలు సెంటర్లలో విక్రయించారు. జిల్లాలో దాదాపు కొనుగోలు సెంటర్ల నుంచి 70వేల క్వింటాళ్ల ధాన్యాన్ని సేకరించి మిల్లులకు సరఫరా చేసింది. ఇందుకు సంబంధించిన ధాన్యం డబ్బులను ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధర రూ.2,320ను ధాన్యం కొనుగోలు చేసిన వారంరోజుల వ్యవధిలో రైతుల ఖాతాల్లో జమ చేశారు. అనంతరం ఎన్నికల సమయం లో రైతులు పండించిన సన్నరకం వడ్లకు చెల్లిస్తామన్న రూ.500బోనస్ పైసల కోసం చుక్కలు చూపిస్తున్నారు. ధాన్యం వేసిన రెండు,మూడు రోజుల్లో అసలు డబ్బులు, బోనస్ పైసలు కూడా వెంటనే పడుతాయని అధికారులు రైతులకు చెప్పడంతో ధాన్యాన్ని కొనుగోలు సెంటర్లలోనే విక్రయించారు. ఇంతవరకు బాగానే ఉన్నా అసలు డబ్బులు పడ్డాయి.. కానీ బోనస్ పైసలే.. నేటికీ సక్రమంగా పడడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. దాదాపు ధాన్యం అమ్మి రెండు, మూడు నెలలు గడుస్తున్నా నేటికీ బోనస్ పైసలు వేయకపోవడం ఏంటని అధికారులను ప్రశ్నిస్తున్నట్లు సమాచారం. ఈ క్రమంలో అధికారుల లెక్కల ప్రకారం ఈ సంవత్సరం కొనుగోలు సెంటర్లకు ధాన్యం వేసిన మొత్తం రైతులకు రూ.33కోట్లు చెల్లించాల్సి ఉంది. ఇందులో ఇప్పటి వరకు రూ.13కోట్లు రైతుల ఖాతాలో జమ అయినట్లు తెలిసింది. ఇంకా రూ. 20 కోట్ల బోనస్ డబ్బులు రైతుల ఖాతాలో జమ కాలేదు. బోనస్ పడకపోవడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బయట మార్కెట్‌లో రూ. 2,800 ధరలు పలికాయని, బయట మార్కెట్‌లో ఇప్పటికే డబ్బులు వచ్చేవంటున్నారు.